
కథానిక

# రేపటి ఉషస్సు



**టి. రామాచారి**

"తియ్యటి, కమ్మటి కమలాపళ్ళు రూపాయకు మూడు... రూపాయకు మూడు..." ఈ కంపార్టుమెంటు మొదటే రద్దీగా వుంటే మధ్యన వీడేమిటనిపించింది. తిరిగి చూస్తే రోజూ కనిపించేవాడే. గార్డు విజిల్‌తో రైలు బయలుదేరింది. ఆ కుర్రాడిక దిగిపోతాడనుకున్నాగాని వాడు దిగలా ఫుట్‌బోర్డు మీద నిల్చుని కిటికీ ఊచని ఒక చేత్తో పట్టుకుని, పక్కనున్న కంపార్టుమెంటులోకి గెంత బోయ్యాడు. తలుపు "ధట్...ట్..."మని మూసుకు పోయింది. అంతే! వాడికాలు ఫుట్‌బోర్డు మీద నుంచి జారిపోయింది. ఒంటిచేత కిటికీ ఊచకు వేళ్ళాడపడిపోయ్యాడు వాడు. ఆ దగ్గరే కూచునున్న అమ్మాయి ఒక్క ఉదుటున లేచి, తలుపుతీసి, ఫుట్‌బోర్డు మీదనే నిలబడి ఒక చేత్తో ఎం[ట్రె]న్స్ దగ్గరున్న ఇనుప బార్‌ని పట్టుకుని మరో చేత్తో వాణ్ణి ఇవతలికి లాగేసింది.

ఉన్నట్టుండి వాడేందుకోగాని నిటారుగా నిలబడి రెండు చేతులూ జోడించి కళ్ళు మూసుకున్నాడు. ఏమిటాని నేనటు చూస్తే మేము రోజూ చూచే చిన్న గుట్ట, దాని మీదున్న గుడీనూ. అందులోని దేవుడికి నమస్కరిస్తున్నాడు వీడు. పెద్ద గండం గడిచినా దాని గురించి ఏమాత్రం పట్టించుకోలేదు వీడు. ఇంతలో లాలాగూడా స్టేషన్ వచ్చింది. అక్కడ దిగిపోయాడు వాడు. రోజూ ఆఫీసవుతూనే నేనుండే మల్కాజ్‌గిరికి వెళ్ళేది నేనీ లోకల్ రైల్లోనే.

మామూలుగా అయితే ఈ కుర్రవాడి గురించీ ఎవ్వరూ పట్టించుకోరు. గాని ఆ రోజు ఆ ఏక్సిడెంటు సంఘటనతో వాడి గురించి నేను కొంచెం సేపు ఆలోచించా. మిగతా అనాథల్లా వీడు బిచ్చమెత్తుకోడు. పొట్టపోసుకోవటానికి తన చేతనైన పనిచేస్తు వుంటాడు. రైలునేగాక దాని వేగాన్ని కూడా గేలిచేస్తూంటాడు. మానవుడి ప్రాణం విలువనే పరిహసిస్తూ ఉంటాడు వీడు. తన ప్రాణాల్ని కాపాడిన దేవ ఎదుటేవున్నా అసలామె గురించి పట్టించుకోడేం వీడు? ఆశ్చర్యమేసింది నాకు. ఆమె చేసిన సాహసానికి మెచ్చుకోలుగా నేను:

ఆ కుర్రాడికోసం మీరు చాలా రిస్క్ తీసుకున్నారు మేడమ్" అంటే ఆమె నన్నొకసారి చూసి మెల్లిగా"

"దుఃఖం యొక్క నిజస్వరూపాన్ని చూసి అనుభవించిన వారు జీవితాన్నెప్పుడూ నిర్లక్ష్యం చెయ్యలేరు" అంది.

ఈ మాటలు రవంత నాటకీయంగా అనిపించినా, వాటిల్లోని నిజం నాకర్థమయింది. వాడి ప్రాణాల్ని ఆమె కాపాడిందేగాని వాడి గురించి ఆ తర్వాత పట్టించుకోనే లేదు.

నేను రోజూ వెళ్ళే మల్కాజ్‌గిరి వరకే అయినా నా మిత్రుడొకాయన అద్దె ఇల్లొకటి చూపెడతానంటే ఆ రోజు ఆఫీసు నించి నేరుగా అటే బయలుదేరాను. సఫీల్‌గుడా స్టేషన్‌లో దిగి నడక సాగించా. ఆమె కూడా అక్కడే దిగింది. వాటర్ ట్యాంక్ దగ్గర అలా ఎడమవైపుకి తిరిగి వెళ్ళిపోయింది. నేను నేరుగా వెళ్ళి నా మిత్రుడితో కొంతసేపు మాట్లాడిం తర్వాత ఇద్దరం కలిసి బయలుదేరాం—ఇల్లు చూడటానికి. తలుపు తెరుచుకుని వచ్చిన వ్యక్తిని చూస్తే ఆశ్చర్యం! ఆమె ఇందాకా నా వెంట వచ్చిన అమ్మాయే! ఆ ఇల్లు చూస్తే చిన్నదే. అయినా అందుల్లోనూ ఒక గది అద్దెకివ్వటమేమిటీ? అని ఆశ్చర్యమేసింది నాకు. మా శ్రీమతి కాన్పుకోసం తల్లిగారింటికి విజయవాడ వెళ్ళింది. తిరిగిరావటానికి రెండునెల్లయినా అవుతుంది. అందాకా ఈ గది చాలనిపించింది.

అందుకే ఆమె అడిగిన రెండు వందల్నీ అడ్వాన్సుగా ఇచ్చేసి మర్నాడే అందులో చేరిపొయ్యా. రోజులు గడిచే కొద్దీ మా పరిచయం ఎక్కువయింది. దానిలో ఒకరి విషయాలు ఒకరికి తెలుస్తూ తెలీని ఆత్మీయతేదో ఏర్పడటం మొదలయింది.

వాళ్ళది ప్రేమ వివాహం. ఆ పెళ్ళికి అటు ఆయన వాళ్ళకి గానీ, ఇటు ఈమె వాళ్ళకి గానీ ఇష్టం లేదు. అయినా పెళ్ళి చేసేసుకున్నారు వీళ్ళు. ఆయన పేరు చిరంజీవి, ఈమె పేరు అన్నపూర్ణ!!

*** *** ***

ఆ రోజు రాత్రి ఎవరో తలుపు తడితే లేచి చూశా. ఆమే!

"మావారి ఆరోగ్యం ఆందోళనకరంగా వుంది. దయచేసి మీరొకసారి వెళ్ళి డాక్టర్ని పిలుచుకొస్తారా?" అనడిగింది.

"ఏమయింది మీ వారికి?" అంటే ఆమె,

"అవన్నీ తర్వాత చెబుతాను. ముందు మీరు వెళ్ళి డాక్టర్ ప్రతాప్ కిషోర్‌ని పిలుచుకురండి" అంది.

"అలాగే" అని వెళ్ళి డాక్టర్ని తీసుకొచ్చా. దారిలో నేనాయన్ని:

"చిరంజీవిగారికి ఏమిటి కంప్లయింట్?" అనడిగితే ఆయన:

"ఇలాంటి వ్యాధులు ఎవరికీ రాకూడదండీ" అని అన్నాడేగాని ఆ వ్యాధేమిటో మాత్రం చెప్పలేదు. ఒక రెండు రోజుల తర్వాత చిరంజీవి కోలుకున్నాడు. ఓ సాయంత్రం పూట నేనాయన్ని చూడటానికి వెడితే ఆయన లేచి కూచుని నవ్వుతూ:

"రండి, రండి. మీ శ్రీమతిగారు ఎప్పుడొస్తున్నారు?" అనంటూ తనందాకా చదువుతున్న పుస్తకాన్ని ఆ మంచం మీదే బోర్లాపెట్టేశాడు. చూస్తే అది జిడ్డు కృష్ణమూర్తి రాసిన పుస్తకం. ఆశ్చర్యమేసింది నాకు! భయంకరమైన వ్యాధితో బాధపడుతూ, రోజుకింత చనిపోతూ కూడా ఎదుటి మనిషిని చూసి మందహాసం చేస్తూ మృత్యువును పరిహసించే చిరంజీవి! నిజంగా చిరంజీవేనని ఆలోచిస్తూనే ఎక్కువ ఆలోచిస్తున్నాను అని అనుకుంటున్నా. ఇంతలో అన్నపూర్ణ నా గదిలోకొచ్చింది. తమ గురించి చెబుతూ:

మా పెళ్ళయిన ఎనిమిదేళ్ళకే మా జీవితాలిలా బుగ్గిపాలవుతాయని ఊహించలేక పొయ్యాం. అనుకోకుండా ఈయనకు అస్వస్థత మొదలయింది. ఏడెనిమిది నెల్లుగా ఈయన లుకేమియాతో బాధపడుతున్నారు. ఈయన ట్రీట్‌మెంట్‌కి చూపిన చోటల్లా అప్పులు చేశాం. నా ఒక్కదాని జీతంలో ఎన్ని అప్పులని తీర్చను? ఎన్ని మందులని కొనను? ఇంటి ఖర్చులెన్నిలా సర్దను? ఎంత డబ్బయినా చాలటంలేదిప్పుడు? ఇవన్నీ చాలనట్లు..." అని ఆగిపోయిందామె. పైకి ఉబుకుకొస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ తన స్వరాన్ని మామూలు స్థాయికి తెచ్చుకునే ప్రయత్నం చేస్తూ"

"నేను ఆయనకోసం ప్రపంచాన్నే ఎదిరించి గెలిచాననుకున్నానుగాని ఇంత త్వరగా మా జీవితాలిలా బుగ్గి పాలవుతాయని కలలో కూడా అనుకోలేకపొయ్యాను. త్వరలోనే నా జీవితంలోకొక తుఫాను రాబోతోందని నాకు తెలుసు. కాని తెలిసీ. నేనేం చేయగలను? దానికి నేను భయపడటం లేదు. అదొచ్చిన రోజున మాత్రం నేనందులో కొట్టుకుపోకుండా భగవంతుడి దయతోపాటు మరో మనిషి సాయం కూడా అవసరం. అలా సాయపడే వారెవరూ లేరనే నా ఇప్పటి బాధ" ఇక ఆమె ఏమీ మాట్లాడలేక లేచి లోపలకు వెళ్ళిపోయింది.

మళ్ళీ ఆ రోజు రాత్రి ఆయన పరిస్థితి విషమించింది. నేను వెళ్ళి మళ్ళీ డాక్టర్ని పిలుచుకు రావటం ఆయన వచ్చి చూచి మందులిచ్చి పోవటం జరిగింది. ఆ రాత్రంతా ఆమెకు జాగరణే. నేనూ అక్కడే వున్నా. కనిపించీ కనిపించని ఆ చీకట్లో ఆమె కళ్ళలో నీళ్ళు తళుక్కున మెరవటం చూచి నేను భరించలేక పొయ్యాను.

"ప్రతి రోజూ మిమ్మల్నిలా కష్టపెడుతున్నాను నేను. కాని ఈ చీకటి, ఈ విషాదం, ఈ నా ఒంటరితనం నన్ను భయపెట్టేస్తున్నాయి. నాకేమయినా నేను లెక్కచెయ్యను. కాని నామూలంగా ఈయన ఇలా పతనమైపోతూంటే...."

ఆమె దుఃఖాన్ని మరిపించటానికని నేను:

"మీ జీవితంలో తుఫాను రావటమేమిటి! హిమాలయమంత ఔన్నత్యమున్న వ్యక్తి మీకండగా ఉండగామీరలా భయపడతారేం?" అనంటే ఆమె:

"ఆ హిమాలయం పగిలే రాబోతోంది తుఫాను. అదొచ్చిన రోజున నేను ఎండుటాకులా అల్లాల్లాడిపోవటం ఖాయం. కాని ఒకటే మాత్రం నిజం. ఏ తుఫానూ ఈ భూమ్మీదనుండి సర్వస్వం తుడిచిపెట్టుకుని పోదు. దాని విధ్వంసం మనల్ని భయపెట్టినా, అది శాశ్వతం మాత్రం కాదు. ఆ బీభత్సంలోంచే మళ్ళీ జీవం పుడుతుంది. జీవి లేస్తాడు. జీవితంలో చిగురిస్తుంది. మళ్ళీ చలనం. మళ్ళీ ప్రగతి. ఇదే జీవన చక్రం. ఇదే సృష్టి రహస్యం."

నాకేం చెప్పటానికీ తోచక అక్కడ నుంచి కదిలా.

కొన్నాళ్ళకి చిరంజీవి పరిస్థితి కొంత మెరుగయింది. ఆ తర్వాత ఒకరోజు ఉన్నట్టుండి ఆమె నన్నొక చిత్రమైన ప్రశ్నడిగింది.

"జీవితంలో మీరెప్పుడైనా, ఒక్క క్షణంపాటయినా సరే, భరింపరాని దుఃఖాన్ని అనుభవించారా? ఆ దుఃఖంలోని లోతుల్ని చూశారా? ఆ లోతుల్లోని ఆవేదనని అర్థం చేసుకున్నారా?" అని. ఆశ్చర్యమేసింది నాకు.

దుఃఖం. ఆవేదన. వీటి నిజస్వరూపం వీటిలోని శోకం. ఆ శోకం యొక్క అనుభూతి. వీటి గురించి ఆలోచిస్తూ—

"అలా అడిగారేం?" అనంటే ఆమె?

"ఏంలేదు. మీకొక సత్యాన్ని చెబుదామని దుఃఖం యొక్క నిజస్వరూపాన్ని దర్శించిన వ్యక్తి జీవితాన్నెప్పుడూ నిరాదరణ చెయ్యలేదు. నా జీవితం సుఖంగా గడిచిన రోజుల్లో అది నిస్సారమని నేనెప్పుడూ అనుకోలేదు. మరి నా ఈ గడ్డురోజుల్లో అది నిస్సారమని దాన్నెలా నిరాదరణ చేయనూ?" అంది. అని

ఆమె మళ్ళీ:

"ప్రతి వినాశంలోనూ ప్రగతికి విత్తనం కనిపిస్తూనే వుంటుంది. అదే జీవితం. నవోస్ ఆర్క్‌లోనూ, వటపత్ర శాయిలోనూ కనిపించేది జీవి... ఆశ... ప్రగతికొచ్చిన్నాం. ఏ పేరుతో చెప్పుకున్నా దాని అర్థం ఒక్కటే. మన జీవితాల్లోనూ అంతే. నా జీవితంలో రేపు రాబోయే తుఫానులోనూ నాకిప్పుడు కనిపిస్తోంది ఆ చిహ్నమే. అదే ఆశ!"

ఆమె చెప్పేది నాకు లీలగా తెలుస్తోంది గాని స్పష్టంగా మాత్రం అర్థమవటం లేదు. కాని నాకప్పుడు అనిపించిన ఆశ్చర్యం ఒకటే. ఇంత అమాయకంగా కనిపించే ఈమెలో ఎన్ని ఆలోచనలు? ఎన్ని ఊహలు? ఎంత విజ్ఞానం?

మర్నాడు నేనుమామూలుగాఆఫీసుకెడితే అక్కడ నాకు విజయవాడ నుంచి ట్రంక్ కాల్ వచ్చింది— మాఆవిడ డెలివరీ అప్పుడు కాంప్లికేషన్స్ రావచ్చనీ, అందుకోసం ఆ సమయంలో నేనక్కడే వుండటం అవసరమనీ. సరే. బెడ్డింగూ, బ్యాగూ తెచ్చుకోటానికి సఫీల్‌గూడా బయలుదేరా. సికింద్రాబాద్ స్టేషన్‌లో మళ్ళీ నాకా కుర్రవాడు కనిపించాడు. వాణ్ణి చూస్తూనే నాకొక ఆలోచనొచ్చింది. నేను విజయవాడ వెడితే ఇక్కడ అన్నపూర్ణ ఒక్కతే ఉండాలి. అప్పుడు జరగకూడనిదేదయినా జరిగితే ఆమెకు తోడెవరుంటారూ? అందుకోసం ఈ కుర్రవాడిని ఆమెకు తోడుంచటం మంచిదనిపించింది. అనుకుని వాణ్ణి పిలిచి అన్నపూర్ణ ఆనవాళ్ళు చెప్పిఆమె రోజూకూచునే సీటును చూపించి "ఆమె దగ్గరుంటావా?" అనంటే వాడు ఆమెను గుర్తుపట్టి ఉండటానికి ఒప్పుకున్నాడు. సరే. నాతోపాటు వాడినీ సఫీల్‌గూడా తీసుకెళ్ళాను. వాడి గురించి వాళ్ళకు చెప్పి నేనొచ్చే వరకూ ఈ కుర్రాడు మీకు సాయంగా ఉంటాడన్నా. అంతా విని అన్నపూర్ణ:

"వాడెవడో ఒకసారి రైలు కింద పడబోయాడు?" అంది. దానికి నేను "అవును వాడే" అంటూ ప్రయాణానికి సిద్ధమయ్యా.

*** *** ***

విజయవాడలో నిజంగా మా ఆవిడకి కాంప్లికేషన్స్ వచ్చేశాయి. నొప్పులొస్తున్నాయే గాని కాన్పు కావటంలేదు. చివరికి సిజేరియన్ చేయవలసొచ్చింది. కాన్పు తర్వాత కూడా ట్రీట్‌మెంట్ కొనసాగించ వలసొచ్చింది. నేనొక నెలరోజులపాటు అక్కడేవున్నా. అందాకా నా గొడవల్లో నేనుండి అన్నపూర్ణా చిరంజీవుల్ని మరిచేపొయ్యాను. తిరిగొచ్చేప్పుడు సఫీల్‌గూడా చేరుకుని ఇంటిగేటు తెరుచుకొని లోపలకెళ్ళి చూస్తే వాళ్ళ పోర్షన్ తలుపులు తెరిచేవున్నాయి.

"రండి అన్నయ్యగారూ" అంటూ లేచి నిల్చుంది. నేను లోపలకెళ్ళి మామూలుగా చిరంజీవి మంచముండేవైపు చూస్తే అక్కడ లేడు. ఆయనా ఎక్కడా కనిపించలేదు. అనుమానంగా నేనామెవైపు చూస్తే తలదించుకుందామె. అతికష్టంమీద ఆమె నోరు పెగల్చుకుని:

"ఆయన పొయ్యారు అన్నయ్యగారూ. మీరు వెళ్ళిన వారం రోజులకే అంతా అయిపోయింది. నేనూహించిన తుఫాను రానే వచ్చింది. వచ్చినా..."

నాకెలాగో అనిపించింది అప్పుడు. నాతో ఆమె ఎప్పుడో అన్న మాటలే జ్ఞాపకమొచ్చాయప్పుడు.

"మీరిప్పుడే ధైర్యంగా వుండాలి అన్నపూర్ణగారూ. మీరే ఒకసారి అన్నారు గుర్తుందా? ప్రతి బీభత్సంలోంచి ఒక ప్రాణి లేస్తుంది. ముందుకి అడుగు వేస్తుంది. మళ్ళీ చలనం. మళ్ళీ ప్రగతి. ఇదే జీవితం. ఇదే సృష్టి రహస్యం."

ఆమె తన కొంగుతో కన్నీళ్ళు తుడుచుకుంటూ—

"అవును అన్నాను. ఇప్పుడు జరగబోయేదీ అదే" అంది.

అప్పుడు నాకు ఈమెనెలాగయినా ఏదో సాయం చెయ్యాలనిపించింది. అనిపించే తడవుగా నా పర్సుతీసి అందులో ఎంతుందో కూడా చూడకుండా—

"చిరంజీవిగారి జ్ఞాపకార్థం ఇదుంచండి. ఇది మీకిప్పుడెంతో అవసరం" అని దాన్ని అక్కడున్న మంచం మీదే వుంచి బయటికొచ్చా. మా శ్రీమతి వచ్చాకయినా నేను మరొక ఇల్లు చూసుకోవాలి. ఆ పనేదో ఇప్పుడే చేస్తే మంచిదనిపించింది. అనుకుని మరో ఇల్లు చూశా. మా శ్రీమతి రాబోతోందని ఆమెతోఅని గది ఖాళీ చెయ్యటానికి సర్దుకుంటూవుంటే నా ఆలోచనలన్నీ ఆ కుర్రవాడూ అన్నపూర్ణల గురించే.

గుడ్డ సంచీ భుజానికి తగిలించుకుని పళ్ళమ్ముకుంటూ జీవనం సాగించే వీడి భవిష్యత్తేమిటి? ప్రతిదాన్నీ గేలిచేసే వీడు దేవుడినెందుకు గేలిచెయ్యడూ?

అలాగే అన్నపూర్ణానూ. తను ప్రేమించిన పురుషుడికోసం ఈమె తన వాళ్ళని ఎదిరించింది. సంఘాన్ని ఎదిరించింది. ఇంతయినా ఈమెకు మిగిలిందేమిటి? కొవ్వొత్తిలా కరిగిపోతూందంతే. తన ఈ [illegible] నోరువిప్పి ఎవర్నీ నిందించరేం?

అయినా నాకొక్కటే అనుమానం. ప్రతిదాన్ని గేలిచేసే ఆ కుర్రవాడూ, ఎంత గడ్డు సమస్యనయినా ధైర్యంగా ఎదుర్కొనే ఈ 'అబలా' ఏనాడైనా తమ దారిద్ర్యాన్ని ఎదుర్కొని, గెలిచి, తాము నమ్ముకున్న ఆ దైవాన్ని, విధిని, కర్మని గేలిచేయగలరాని? ఇలా ఆలోచిస్తూంటేఆ కుర్రవాడు నా దగ్గర కొచ్చి—

"దీదీనేయే ఆప్కో భేజీహై" అని నేనామెకిచ్చిన పర్సునీ, గుండ్రంగా చుట్టిన ఒక పేపర్నీ నాకందించాడు. తీసి చూస్తే ఆ పర్సులో ఒక చిన్న చీటీ ముక్క వుంది.

"రాబోతున్న చిరంజీవి దీన్నిమీకు తిరిగి ఇచ్చేయ్యమన్నారు" అనుంది అందులో. ఈమె భవిష్యత్తేమిటని ఆలోచిస్తున్న నాకు ఈ వాక్యాన్ని చూచి అందాకా నా మనస్సులో బిగుసుకుంటూన్న ముడేదో విప్పుకున్నట్టయింది!


## కథా రచయితలకు ఆహ్వానం

తెలుగువారి జీవనాన్నీ, సంస్కృతినీ సంఘర్షణనీ ప్రతిబింబించే కథలకు 'ఆదివారం ఆంధ్రజ్యోతి' ఆహ్వానం పలుకుతోంది.

మానవ జీవనంలోని వివిధ కోణాలమీద వెలుగు ప్రసరించే, ఆసక్తికరమైన కథలకు ప్రాధాన్యత వుంటుంది. కథలు నాలుగు లేక అయిదు అరఠావులకు మించకూడదు. కనీసం 2,500 పదాలకు తగ్గక ఉండాలి!

కథలు ఈ కింది చిరునామాకి పంపించాలి.

ఎడిటర్,
'ఆదివారం ఆంధ్రజ్యోతి' ఆంధ్రజ్యోతి దినపత్రిక,
బంజారా హిల్స్, రోడ్ నెం.3,
హైదరాబాద్- 500 034